క్లుప్తంగా

మహిళలు పెరటి కోళ్లు పెంచాలి



కోళ్ల ఫాం ప్రారంభిస్తున్న మార్కెట్ చైర్మన్

ఇబ్రహీంపట్నం: పెరటి కోళ్ల పెంపకానికి మహిళా సంఘాల సభ్యులు ముందుకు వచ్చి పెంచితే ఆదాయం వస్తుందని మార్కెట్ కమిటీ చైర్మన్ బోరిగం రాజు అన్నారు. మండలంలోని కోమటికొండాపూర్ గ్రామానికి చెందిన శ్రీ యోగాశ్వర గ్రామ సంఘ సభ్యురాలు కాంపెల్లి జలజకు పెరటి కోళ్ల పెంపకానికి యూనిట్ మంజూరైంది. కోళ్ల ఫామ్‌లో కోడిపిల్లలను ఎంపీడీవో చంద్రశేఖర్, ఏపీఎం శంకర్ పరిశీలించారు. కార్యక్రమంలో ఏపీఎం శంకర్‌తో పాటు మండల సమైఖ్య అధ్యక్షురాలు సునీత, కమ్యూనిటి కో ఆర్డినేటర్లు సురేఖ, సాయేంధర్, రాజశ్రీ, మహిళ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

‘గల్ఫ్ చేసిన మేలు’ ఆల్బమ్ రిలీజ్



ఆల్బమ్ రిలీజ్ చేస్తున్న వందేమాతరం శ్రీనివాస్

మేడిపల్లి: తెలంగాణ యువకులను గల్ఫ్ దేశాలు ఎంతగానో ఆదుకున్నాయని, అక్కడి ప్రజలు మన కార్మికులకు ఇచ్చిన ఉపాధి గురించి దుబాయ్‌లో ఉండే భీమారం మండలంలోని రాజలింగంపేట గ్రామానికి చెందిన సింగర్, రైటర్ కోరెపు మల్లేశ్ రాసిన ।గల్ఫ్ చేసిన మేల్లు ఆల్బమ్‌ను సంగీత దర్శకుడు వందేమాతరం శ్రీనివాస్ రిలీజ్ చేశారు. దుబాయ్‌లో స్పార్క్ మీడియా ఆధ్వర్యంలో జరిగిన బతుకమ్మ సంబరాల వేదికగా పోస్టర్ రిలీజ్ చేశారు. తన పాట కోసం సాయం చేసినవారికి మల్లేశం కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో యూట్యూబ్ ఫేం డాన్సర్ నాగ దుర్గ, రేడియో ఖుషీ తదితరులు పాల్గొన్నారు.

శక్తిశాలి భారత్ నిర్మాణమే ఆర్‌ఎస్‌ఎస్ ధ్యేయం

జగిత్యాల: శక్తిశాలి భారత్ నిర్మాణమే ఆర్‌ఎస్‌ఎస్ ధ్యేయమని ఆర్‌ఎస్‌ఎస్ ప్రాంత సహ వ్యవస్థ ప్రముఖ్ తిరుమల్‌జీ అన్నారు. బుధవారం గీత విద్యాలయంలో దేశ పునర్నిర్మాణమే ధ్యేయంగా ఆర్‌ఎస్‌ఎస్ కార్యక్రమం నిర్వహించారు. శక్తివంతమైన దేశ నిర్మాణం కోసం ప్రజలు తమ ఆలోచన విధానాన్ని మార్పు చేసుకోవాలన్నారు. ప్రతిఒక్కరూ దేశభక్తులై ఉండి పోరాటం చేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఎస్‌ఎస్ సంఘచాల్ భీమనాతిని శంకర్, ఆకుతోట శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

నిమజ్జనానికి ఏర్పాట్లు పూర్తి

జగిత్యాలక్రైం: దుర్గ శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా జిల్లా కేంద్రంలో 25 చోట్ల దుర్గమాత విగ్రహాలను ప్రతిష్ఠించారని పట్టణ సీఐ వేణుగోపాల్ తెలిపారు. ఈనెల 12న శనివారం దుర్గమాతా విగ్రహాలను నిమజ్జనం చేసేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. విగ్రహాలను చింతకుంట చెరువు, ధరూర్ కెనాల్, లింగంపేట చెరువు, అంతర్గాం చెరువు, మోతె చెరువులో నిమజ్జనం చేయనున్నట్లు పేర్కొన్నారు.

ఎస్సీ వర్గీకరణపై మాట నిలబెట్టుకోవాలి

కోరుట్ల: ఎస్సీవర్గీకరణపై సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం మాట నిలబెట్టుకోవాలని ప్రజా సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు పేట భాస్కర్ అన్నారు. కోరుట్లలో బుధవారం అంబేద్కర్ విగ్రహానికి పూల మాల వేసి నాయకులతో కలిసి మాట్లాడారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం తెలంగాణలో వర్గీకరణ అమలు చేస్తామని ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలని కోరారు. డీఎస్సీ ఫలితాల్లో వర్గీకరణ అమలు చేయక పోవటాన్ని నిరసిస్తూ నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. కార్యక్రమంలో అంబేడ్కర్ మాదిగ కుల సంఘం అధ్యక్షుడు శనిగారపు రాజేశ్, మండల అధ్యక్షుడు జాగర్ల రాజయ్య, ఎస్. రాజయ్య, తదితరులు పాల్గొన్నారు.

లైంగిక వేధింపుల నిరోధక చట్టం అమలేదీ?

జగిత్యాల: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు రంగ సంస్థల్లో లైంగిక వేధింపుల నిరోధక చట్టం 2013 అమలుకు కమిటీ లేకపోవడంతో మహిళలు ఇబ్బందులు పడుతున్నారని బీసీ మహిళ సంఘం అధ్యక్షురాలు జలజ అన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైద్య, మహిళా, శిశు సంక్షేమ శాఖ, విద్యుత్, పోలీసు శాఖల్లో వెంటనే లైంగిక వేదింపుల నిరోధక కమిటీవేయాలన్నారు. జిల్లా కేంద్రంలోని ఓ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థినితో అసభ్యకరంగా ప్రవర్తించగా కేసు నమోదైందన్నారు. మహిళ ఉద్యోగులు తమపై జరుగుతున్న వేధింపులు చెప్పుకునేందుకు కమిటీలు లేక ఏం చేయాలో అర్థం కాని పరిస్థితుల్లో ఉన్నారన్నారు.



బతుకమ్మ ఉత్సాహంగా ఆడుకుంటాం



మహిళలకు పెద్ద పండుగ బతుకమ్మ. వాడకట్టు మహిళలందరం ఒకచోట చేరి వివిధ రకాల పువ్వులతో బతుకమ్మలను పేర్చి చుట్టు పక్కల వారితో కలిసి బతుకమ్మ వేడుకల్లో పాల్గొంటాం. పెద్ద బతుకమ్మ వేడుక రోజు ఊర్లోని మహిళలందరం కలిసి ఆట పాటలతో గడపడం అనుభూతి వేరుగా ఉంటుంది. చదువు, ఉద్యోగం కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లినవారు పండుగ రోజు కలవడం ఆనందంగా ఉంటుంది.

– పులికాంత శశికళ, ప్రభుత్వ టీచర్, కథలాపూర్

తీరొక్క పూలతో బతుకమ్మ పేర్చుతాం



బతుకమ్మ అంటేనే మహిళల్లో తొమ్మిది రోజులపాటు భక్తి భావంతో పాటు, ప్రతిరోజు రకరకాల పూలతో బతుకమ్మలు పేర్చి పూజలు చేసిన అనంతరం బతుకమ్మ ఆటలాడుతూ మహిళలంతా ఎంతో సరదాగా గడుపుతాం. ఏడాదిలో ఈ తొమ్మిది రోజులు మాత్రం మహిళలకు ఈ పండుగ సంతోషాన్నిస్తుంది.

– వాసం పద్మ, రాయికల్

తొమ్మిది రోజులపాటు భక్తిశ్రద్ధలతో ..



బతుకమ్మ అంటేనే గుర్తుకు వచ్చేది తొమ్మిది రోజుల పండుగ. మొదటి రోజు నుంచి ప్రారంభమై తొమ్మిదో రోజుల వరకు ప్రతీ రోజు యొక్క విశిష్టత గురించి వివరిస్తూ బతుకమ్మ ఆటలు ఆడుతాం. చిన్నా పెద్దా అనే తేడా లేకుండా బతుకమ్మ ఆటలు ఆడి చివరి రోజు చెరువుల్లో నిమజ్జనం చేస్తాం.

– వాసం అనురాధ, రాయికల్



ధర్మపురి: బోనాలతో వస్తున్న మహిళలు



కోరుట్ల: సంగెంలో భక్తుల పూజలు



గంబీర్‌పూర్‌లో చల్మెడ పూజలు



కండ్లపల్లిలో చిన్నారులకు అక్షరాభ్యాసం



నాచుపల్లిలో ఎమ్మెల్యే పూజలు



లక్ష్మీపూర్‌లో దుర్గామాతకు పూజలు చేస్తున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

సరస్వతీదేవిగా అమ్మవారు

జగిత్యాల/జగిత్యాలరూరల్/కోరుట్లరూరల్/ధర్మపురి/రాయికల్/కథలాపూర్/ఇబ్రహీంపట్నం/పెగడపల్లి/మల్యాల/సారంగాపూర్: దేవీ శరన్నరాత్రుల్లో భాగంగా దుర్గాదేవి బుధవారం సరస్వతి దేవిగా దర్శనమిచ్చారు.ఈ సందర్భంగా నిర్వాహకులు సరస్వతీ దేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండపాల్లో చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. పలువురు ప్రజాప్రతినిధులు, పార్టీల నాయకులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అమ్మవారికి బోనాలు చేశారు. పలుచోట్ల భక్తులకు అన్నదానం చేశారు.



మెట్‌పల్లిలో బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న భక్తులు



కోరుట్ల, రాయికల్ లో బతుకమ్మ ఆడుతున్న మండల పరిషత్ కార్యాలయాల సిబ్బంది



మల్లాపూర్ పీహెచ్‌సీలో బతుకమ్మలతో డాక్టర్ వాహిని, సిబ్బంది

బతుకమ్మ వేడుకలు

కోరుట్ల రూరల్/రాయికల్/మల్లాపూర్/ పెగడపల్లి: కోరుట్ల మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మహిళలు, సిబ్బంది బతుకమ్మ ఆటలు ఆడారు. రాయికల్ మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు.పెగడపల్లి మండలంలోని సుద్దపల్లిలో మంగళవారం రాత్రి బతుకమ్మ ఆటలు, పాటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు.మల్లాపూర్ పీహెచ్‌సీలో సిబ్బంది బతుకమ్మ ఆడారు.

బతుకమ్మ పండుగకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలి

• ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



అక్షరాభ్యాసం చేయిస్తున్న ప్రభుత్వ విప్

మేడిపల్లి: బతుకమ్మ, దసరా పండుగలకు ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. మండల కేంద్రంలో అమ్మవారిని దర్శించుకుని, బతుకమ్మ ఘాట్‌ని అధికారులతో కలిసి పరిశీలించారు. మహిళలకు ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు. దమ్మన్నపేటలో అమ్మవారిని దర్శించుకుని చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. భీమారం మండలం గోవిందారం అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయనను నిర్వాహకులు సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీవో పద్మజ, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ఏనుగు రమేష్‌రెడ్డి, సింగిరెడ్డి నరేష్‌రెడ్డి, చేపూరి నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

చీరల పంపిణీ

భీమారం మండలంలోని గోవిందారం గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐ ప్యాట నారాయణ్ పటేల్ సహకారంతో గ్రామానికి చెందిన సుమారు 100 మంది మహిళలకు చీరలు సమకూర్చగా, బుధవారం విప్ ఆది శ్రీనివాస్ మహిళలకు అందించారు.

కథలాపూర్: మండలంలోని గంభీర్‌పూర్, అంబారిపేట గ్రామాల్లోని దుర్గామాత మండపాల్లో బుధవారం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రత్యేక పూజలు చేశారు. ప్రభుత్వ విప్‌ను నిర్వాహకులు సన్మానించారు.

‘కాటమయ్య’ కిట్లను సద్వినియోగం చేసుకోవాలి

• కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్



కాటమయ్య కిట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

కోరుట్ల రూరల్: కాటమయ్య కిట్లను గీత కార్మికులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ అన్నారు. మండలంలోని యూసుఫ్‌నగర్‌లో ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో కాటమయ్య కిట్స్ పంపిణీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గీత కార్మికులకు మాయవారు, చెట్టు పన్నును గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం రద్దు చేసిందని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ, ఎస్సై, గుగ్గిళ్ల తుక్కారాం గౌడ్, గుగ్గిళ్ల ప్రియాంక, గీత కార్మిక సంక్షేమ సంఘం నాయకులు పాల్గొన్నారు.

కళాశాల సమస్యలపై ఎమ్మెల్యేకు వినతి

కోరుట్ల: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ప్రిన్సిపాల్ గౌసూర్ రహమాన్ ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్‌కు బుధవారం వినతి పత్రం సమర్పించారు. కళాశాలలోని ఫిజిక్స్, కెమిస్ట్రీ ల్యాబ్ రూంల పైకప్పు చెడిపోయిందని, మరమ్మతులు చేయించాలని, కళాశాలలోని పలు సమస్యలను వివరిస్తూ వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో అధ్యాపకులు నటరాజ్, ఇమ్రాన్‌ఖాన్, సంజీవ ప్రసాద్, జయదేవ్, మోహిద్, తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ బలోపేతానికి పాలకవర్గం కృషి చేయాలి



బాధ్యతలు స్వీకరిస్తున్న ఏఎంసీ చైర్‌పర్సన్

మల్లాపూర్: వ్యవసాయ మార్కెట్ కమిటీ బలోపేతానికి చైర్మన్, వైస్ చైర్మన్, పాలకవర్గసభ్యులు కృషి చేయాలని కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు జువ్వాడి కృష్ణారావు అన్నారు. మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో బుధవారం ఏఎంసీ పాలకవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. చైర్మన్‌గా అంతడపుల పుష్పలత, వైస్ చైర్మన్ ఇట్టెడి నారాయణరెడ్డి, డైరెక్టర్లు పదవీ బాధ్యతలు చేపట్టారు. కార్యక్రమంలో కిసాన్‌కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఎలాల జలపతిరెడ్డి, ఏఎంసీ కార్యదర్శి సురేందర్, నాయకులు అంతడపుల నర్సయ్య, పుండ్ర శ్రీనివాస్‌రెడ్డి, నల్ల బాపురెడ్డి, సిరిపురం రవీందర్, గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, మామిడి లక్ష్మారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మీసేవ కేంద్రం ప్రారంభం

ఇబ్రహీంపట్నం: మండలంలోని ఎర్దండిలో మీసేవ కేంద్రాన్ని బుధవారం తహసీల్దార్ ప్రసాద్ ప్రారంభించారు. మండలకేంద్రానికి చెందిన కుల్‌దీప్ అనే వ్యక్తికి మీసేవ కేంద్రం మంజూరైంది. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఎర్దండితోపాటు చుట్టు పక్కల గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ నిర్ణయించిన రేటు ప్రకారం డబ్బులు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో చంద్రశేఖర్, డిప్యూటి తహసీల్దార్ ప్రసాద్, గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యార్థికి అభినందన

ఇబ్రహీంపట్నం: మండలంలోని అమ్మక్కపేట గ్రామానికి చెందిన కాశిరెడ్డి శేఖర్, మమత దంపతుల కుమారుడు కాశిరెడ్డి మంజునాథ్‌రెడ్డి నీట్ పరీక్షలో 524 మార్కులు సాధించి ఎంబీబీఎస్‌లో కన్వీనర్ కోటాలో సీటు సాధించారు. కరీంనగర్‌లోని ప్రతిమ వైద్యశాలలో అడ్మిషన్ పొందారు. ఈసందర్భంగా మంజునాథ్‌రెడ్డిని స్నేహితులు, గ్రామస్తులు అభినందించారు.

అజయ్‌ని స్వదేశానికి రప్పిస్తాం



జీవన్‌రెడ్డిని కలిసిన పల్లపు అజయ్ తల్లిదండ్రులు

సారంగాపూర్: ఇరాక్‌లో చిక్కుకున్న మండల కేంద్రానికి చెందిన పల్లపు అజయ్‌ని స్వదేశానికి రప్పించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి హామీ ఇచ్చారు. అజయ్ తల్లితండ్రులు రాధ, గంగయ్య బుధవారం ఎమ్మెల్సీని కలిసి మొరపెట్టుకున్నారు. తమ కుమారుడు రూ. 2.70 లక్షలు ఏజెంట్‌కు చెల్లించి ఇరాక్ వెళ్లాడని, 14 నెలలుగా గదికే పరిమితయ్యాడని, అక్కడి వ్యక్తి పాస్‌పోర్ట్ లాక్కున్నారని, ఎలాగైనా తమ కుమారుడిని ఇండియాకు తీసుకొచ్చేలా చర్యలు తీసుకోవాలని వేడుకున్నారు. స్పందించిన జీవన్‌రెడ్డి తగిన సహాయం అందించాలని పోలీసులకు సూచించారు. ఎంబస్సీ అధికారులతో మాట్లాడేలా సీఎం దృష్టికి తీసుకెళ్తానన్నారు.

అధికారుల తీరుకు నిరసనగా దీక్ష

మల్లాపూర్: జిల్లా సహకార అధికారులు వ్యవహరిస్తున్న తీరుపై నిరసన తెలిపేందుకే దీక్ష చేపట్టినట్లు ప్యాక్స్ చైర్మన్ బద్దం అంజిరెడ్డి అన్నారు. సిరిపూర్ సహకార సంఘం ఎదుట పాలకవర్గ సభ్యులు చేపట్టిన దీక్ష బుధవారం 5వ రోజుకి చేరింది. నిధుల దుర్వినియోగం పాల్పడిన గత సీఈవోపై చర్యలు తీసుకుని, ఆ నిధుల రికవరీకి సహకరించాల్సిన జిల్లా అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారని, కాంగ్రెస్ నాయకులు దీనికి వంత పాడడం తగదన్నారు. తమ డిమాండ్లపై అధికారులు స్పందించే వరకు నిరసన కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో వైస్‌చైర్మన్ దూలూరి సుధాకర్, డైరెక్టర్లు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

మెట్‌పల్లిరూరల్:మెట్‌పల్లి మండలం జగ్గాసాగర్ శివారులో ఓ ఆటోలో అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని పోలీసులు బుధవారం పట్టుకున్నామని సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. పక్కా సమాచారంతో దాడులు చేయగా.. ఓ ఆటోలో 24 క్వింటాళ్ల బియ్యం తరలిస్తున్నట్లు గుర్తించామని, ఆటోతోపాటు డ్రైవర్ సెల్‌ఫోన్ సీజ్ చేశామని ఒకరిపై కేసు నమోదు చేశామని తెలిపారు.

కోరుట్లలో హిందూ ఐక్యవేదిక ర్యాలీ



ఆర్డీవోకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కోరుట్ల: సనాతన పరిరక్షణ హిందూ ఐక్యవేదిక ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. కొండా లక్ష్మణ్ బాపూజీ, అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ప్రతీ హిందువూ సనాతన ధర్మానికి కట్టుబడి ఉండాలని ప్రతిజ్ఞ చేశారు. సనాతన హిందూ ధర్మ పరిరక్షణ బోర్డు ఏర్పాటు కోసం ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని ఆర్డీవో కార్యాలయంలో వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్, సద్గురు మహాదేవ్, విశాఖ తీర్థ స్వామీజి, జగదీశ్వరానంద గిరి స్వామి,పలువురు కౌన్సిలర్లు, ప్రజాప్రతినిదులు, హిందూ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

గ్రామంలో సమస్యల పరిష్కారానికి కృషి

• ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

బుగ్గారం: మండలంలోని చిన్నాపూర్‌లో అన్ని సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తానని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. బుధవారం గ్రామంలో ప్రతిష్ఠించిన దుర్గాదేవి అమ్మవారిని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు పలువురు స్థానిక సమస్యలను విప్ ముందుంచారు. గ్రామంలోని డబుల్ బెడ్‌రూం ల సమస్యను తీర్చాలని కోరారు. మరిన్ని సమస్యలు విన్నవించగా, విప్ సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వేముల సుభాష్,నాయకులు శంకరయ్య, బుర్ర రమేశ్, కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విప్‌కు సన్మానం

ధర్మపురి: ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం 11,062 పోస్టులతో మెగా డీఎస్సీ నిర్వహించి సీఎం చేతుల మీదుగా నియామక పత్రాలను అందజేయడంపై టీఆర్టీఎఫ్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణ టీచర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ను సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు కటుకం రమేశ్, రాష్ట్ర మెంబర్‌షిప్ కన్వీనర్ ప్రభాకర్‌రావ్, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సురేశ్, శ్రీనివాసగౌడ్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

నియోజకవర్గంలో 40 వేల సభ్యత్వం చేయించాలి

కథలాపూర్: వేములవాడ నియోజకవర్గంలో 40 వేల మందిని బీజేపీ సభ్యత్వం చేయించడమే లక్ష్యంగా నాయకులు పనిచేయాలని ఆ పార్టీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు కొడిపెల్లి గోపాల్‌రెడ్డి కోరారు. మండలంలోని దూలూర్‌లో బుధవారం బీజేపీ సభ్యత్వ నమోదు చేపట్టారు. బీజేపీ నాయకులు ఆయా వాడల్లో తిరిగి ప్రజలకు కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తూ సభ్యత్వం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రధాని మోడీ రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చారన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సయ్య, కిసాన్‌మోర్చా మండలాధ్యక్షుడు నరెడ్ల రవీందర్‌రెడ్డి, నాయకులు మీన్‌రెడ్డి, రాజు, విజయ్, గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ రాష్ట్ర కమిటీలో బీర్‌పూర్ మండలవాసులకు చోటు

సారంగాపూర్: పీఆర్‌టీయూ రాష్ట్రస్థాయిలో జరిగిన ఎన్నికల్లో బీర్‌పూర్ మండలానికి చెందిన నలుగురు ఉపాధ్యాయులు చోటుదక్కించుకున్నారు. రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులుగా కొలిచాల సత్యరాజ్, వి. భాస్కర్‌రెడ్డి (తుంగూర్ హెచ్ఎం), బొమ్మకంటి శ్రీనివాస్, రాష్ట్ర కార్యదర్శిగా జూపల్లి సుదర్శన్ ఎన్నికయ్యారు. తమ ఎన్నికకు సహకరించిన రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు శ్రీపాల్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి, జగిత్యాల జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆనంద రావు, అమర్నాథ్‌రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు.

స్కూటీ, బైక్ ఢీ ఒకరి తీవ్రగాయాలు

మల్యాల: మండల కేంద్రంలోని శివారులో స్కూటీ, బైక్ ఢీకొన్న సంఘటనలో ఒకరు తీవ్రంగా గాయపడగా, మరొకరు స్వల్పంగా గాయపడ్డారు. మండలంలోని తాటిపల్లి గ్రామానికి చెందిన అట్ల రిషిత బుధవారం తన కుమారుడితో కలిసి స్కూటీపై మల్యాలకు వెళ్తోంది. గ్రామ శివారులోని మొండికుంట ఒర్రె వంతెనపై వాహనం నిలుపగా, అదే గ్రామానికి చెందిన దూడ రాజ్‌కుమార్ వెనక నుండి వచ్చి స్కూటీని ఢీకొన్నాడు. దీంతో రాజ్‌కుమార్ తలకు తీవ్ర గాయాలు కాగా, రిషితకు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు 108 ఈఎంటీ జ్యోతి, పైలట్ అంజి, బాధితులకు ప్రాథమిక చికిత్స అందజేసి, జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

మల్యాల: మండలంలోని ముత్యంపేట శివారులో ఎదురెదురుగా రెండు బైక్‌లు ఢీకొన్న సంఘటనలో ఇద్దరు గాయపడ్డారు. ముత్యంపేట గ్రామానికి చెందిన బండక్ల శ్రీనివాస్, నాచుపల్లికి చెందిన మరో వ్యక్తి దిగువ కొండగట్టులోని ముత్యంపేట రోడ్డులో బుధవారం సాయంత్రం ఎదురెదురుగా ఢీకొన్నారు. ఈ సంఘటనలో శ్రీనివాస్ తలకు గాయాలు, మరో వ్యక్తికి కాలికి గాయాలయ్యాయి. మాజీ ఎంపీపీ దారం ఆదిరెడ్డి 108 కు సమాచారం అందించి, శ్రీనివాస్ వెంట ఆస్పత్రికి తీసుకెళ్లారు. సిబ్బంది పైలట్ ఆంజనేయులు, ఈఎంటీ జ్యోతి బాధితులకు ప్రాథమిక చికిత్స అందజేసి, జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్చారు.

పిచ్చికుక్క దాడిలో ఒకరికి గాయాలు

జగిత్యాలరూరల్: జిల్లా కేంద్రంలోని సుతారిపేటలో కాలినడకన రోడ్డుపై వెళ్తున్న అజీజ్‌ఖాన్ అనే యువకుడిపై బుధవారం పిచ్చికుక్క దాడిచేసింది. దీంతో యువకుడికి నడుముపై తీవ్రగాయాలయ్యాయి. వెంటనే స్థానికులు చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

చెక్కు అందజేత

కొండగట్టు: కొడిమ్యాల మండల కేంద్రానికి చెందిన దండగుల రాజం కొద్ది రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో మరణించాడు.మృతుడికి టీఆర్‌ఎస్ పార్టీ సభ్యత్వం ఉండటంతో రూ.2లక్షల ప్రమాద బీమా చెక్కు మంజూరైంది. బుధవారం వారి కుటుంబ సభ్యులకు చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకే రవి శంకర్ చెక్కును అందజేశారు. ఆయన వెంట నాయకులు పునుగుటి కృష్ణారావు, టీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పులి వెంకటేశ్ ,నాయకులు పాల్గొన్నారు.

భూవివాదంలో కేసు నమోదు

జగిత్యాల క్రైం: జగిత్యాల రూరల్ మండలం జాబితాపూర్‌లో బుధవారం భూవివాదంలో రెండు కుటుంబాలు ఒకరిపై ఒకరు దాడి చేసుకోవడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై సధాకర్ కథనం ప్రకారం జాబితాపూర్ గ్రామానికి చెందిన గడ్డం లక్ష్మారెడ్డి, అదే గ్రామానికి చెందిన మానస మధ్య చాలా రోజులుగా భూవివాదం నెలకొని ఉంది. ఈ క్రమంలో బుధవారం సాయంత్రం రెండు కుటుంబాల మధ్య మరోసారి భూవివాదం విషయంలో ఏర్పడ్డ గొడవతో లక్ష్మారెడ్డి మానసపై దాడి చేయడంతో, మానస ఫిర్యాదు మేరకు లక్ష్మారెడ్డిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.